సాక్షి
చిత్తూరు

శనివారం । 8 । జూన్ । 2024



గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనార్ మధుబాల అన్నారు

- 8లో



ఇంద్రవరధుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యాదమరిలోని ప్రసిద్ధ ఇంద్రవరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

- 8లో



సేంద్రియం..లాభాల సేద్యం

నగరి నియోజకవర్గంలో సేంద్రియ సాగుపై రైతులు దృష్టి సారించారు. రసాయనిక ఎరువులను తగ్గించారు.

- 8లో

న్యూస్‌రీల్

వ్యవసాయ మండలి పదవికి రాజీనామా



రామచంద్రారెడ్డి

బంగారుపాళెం: వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ పదవికి మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ప్రభుత్వానికి పంపినట్లు ఆయన చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

ఆగని గజ దాడులు



ధ్వంసమైన టమాట తోట

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్దకాప్పల్లె పంచాయతీలోని అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లె, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లె, జిట్టంవారిపల్లె, పెనుగొలకల, పెద్దకాపల్లె, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె ల్లో పంటలను నాశనం చేస్తున్నాయి. గురువారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూరు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు కొత్తబూరగపల్లె గ్రామ సమీపంలోని టమాట, మామిడి తోటలపై విధ్వంసం సృష్టించాయి. టమాట పంటను తొక్కి నాశనం చేశాయి. శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆదర్శ ప్రవేశాలకు దరఖాస్తులు

రామకుప్పం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు దరఖాస్తుతోపాటు అందించాలన్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహించి, మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 7వ తరగతికి రాష్ట్ర స్థాయి, 8,9 తరగతులకు సెంట్రల్ సిలబస్ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆమె శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. మాతాశిశు మరణాల నివారణ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలన్నారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, హైరిస్క్ కేసుల విషయంలో నిర్లక్ష్యం వద్దన్ని సూచించారు. అధికారులు జానకీరావు, జార్జ్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమాత్య పదవిపై ఆశలు!

కూటమి ఎమ్మెల్యేలు ఇప్పుడు అమాత్య పదవులపై కన్నేశారు. మంత్రి పీఠం ఎక్కేందుకు ముచ్చట పడుతున్నారు. దర్జాగా బుగ్గ కారులో తిరిగాలని ఆశపడుతున్నారు. నూతనంగా ఏర్పాటవుతున్న కూటమి ప్రభుత్వంలో అధికారం అనుభవించాలని తహతహలాడుతున్నారు. కేబినెట్‌లో చోటు దక్కించుకుని పరిపాలనలో భాగస్వాములు కావాలని ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఆశవహులు తమ అధినేతల ముందు ప్రతిపాదనలు పెడుతున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర సర్కారులో ఉన్నత స్థానం పొందేందుకు చిత్తూరు ఎంపీ సైతం పోటీపడుతున్నారు.

- తిరుపతి జిల్లా నుంచి ఐదుగురు.. అందులో ఒకరు జనసేన ఎమ్మెల్యే
- ఎస్సీ కోటా కింద ఇద్దరు.. మరో ముగ్గురు ఓసీ ఎమ్మెల్యేలు
- చిత్తూరు జిల్లా నుంచి సీనియర్ల జాబితాలో అమరనాథ్‌రెడ్డి
- కేంద్ర మంత్రి పదవిపై కన్నేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు



అమరనాథరెడ్డి



మురళీమోహన్



బొజ్జల సుధీర్‌రెడ్డి



దగ్గుమళ్ల ప్రసాద్‌రావు



ఆరణి శ్రీనివాసులు



సాక్షి, తిరుపతి : సార్వత్రిక ఎన్నికల పోరు ముగిసింది. కూటమి గెలుపొందింది. త్వరలోనే కేబినెట్ కూర్పు జరగనుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబుతోపాటు కొందరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆ జాబితాలో ఎవరికి చోటు లభిస్తుందనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యేలు మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. చిత్తూరు జిల్లా విషయానికి వస్తే కుప్పం నుంచి గెలుపొందిన చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపడుతారు. మంత్రి పదవులకు వచ్చేసరికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డికే ఎక్కువ అవకాశం ఉంది. జిల్లాలోనే సీనియర్ కావడం, గతంలోనూ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండడం, చంద్రబాబు, లోకేష్‌తో మంచి సంబంధాలు ఉండడం ఆయనకు కలిసిరానున్నట్లు సమాచారం. ఓసీ కోటా కింద ఒకరికి ఇవ్వాల్సి వచ్చినా.. చిత్తూరు జిల్లా నుంచి అమరనాథ్‌రెడ్డికే ఛాన్స్. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి ఓసీలకు అవకాశం లేదంటే.. ఎస్సీ ఎమ్మెల్యేల్లో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లాలో ఇద్దరు ఎస్సీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒకరు పూతలపట్టు నుంచి గెలుపొందిన మురళీమోహన్, మరొకరు గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్. ఈ ఇద్దరిలో మురళీమోహన్‌కి మంత్రి పదవి వరించే అవకాశం ఉంది. ఆయన సీనియర్ జర్నలిస్ట్ కావడమే అందుకు కారణం . నగరి, చిత్తూరు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, జగన్‌మోహన్‌కి మంత్రి పదవి అవకాశాలు తక్కువనే చెప్పవచ్చు.

జనసేన కోటాలో ఆరణికి అవకాశం

కూటమిలో జనసేన పాత్ర కీలకం. ఈ కూటమి ఏర్పడడానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కారణం. బీజేపీని ఒప్పించి టీడీపీతో జట్టు కట్టించారు. ఈ మూడు పార్టీలు ఏకమవడంతోనే అధికారం దక్కించుకున్నారనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో జనసేన నుంచి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకి మంత్రి వర్గంలో స్థానం దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రెండో సారి ఎమ్మెల్యే కావడం కూడా ఆయనకు కలిసి రానుంది.



అమరనాథ్‌రెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నేత

తిరుపతి జిల్లా జాబితా పెద్దదే

జిల్లాలో తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు అందరూ మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. వీరిలో మొదటి సారి గెలుపొందిన వారి జాబితాలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసా విజయశ్రీ ఉన్నారు. మహిళల కోటా కింద మంత్రి పదవి వరిస్తే.. విజయశ్రీకే అవకాశాలు ఉన్నాయి. బొజ్జల సుధీర్‌రెడ్డి విషయానికి వస్తే.. తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి చంద్రబాబుతో సాన్నిహిత్యం ఉంది. ఎన్టీఆర్‌ని దింపేసి చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయడంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కీలక పాత్ర పోషించారనే విషయం అందరికీ తెలిసిందే. చంద్రబాబు ఆ కోణంలో ఆలోచిస్తే బొజ్జల సుధీర్‌రెడ్డికి మంత్రి వర్గంలో స్థానం దక్కే అవకాశముంది. సీనియర్లకు మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే ముగ్గురు ఎమ్మెల్యేలు పోటీపడుతున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఉన్నారు. ఈ ముగ్గురిలో సీనియర్ కురుగొండ్ల రామకృష్ణ. ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉంది. సీనియర్ల జాబితాలో ఇస్తే గిస్తే వెంకటగిరి ఎమ్మెల్యేనే మంత్రి పదవి వరించే అవకాశం ఉంది. ఎస్సీ కోటా కింద మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే.. ఆదిమూలం లేదా పాశం సునీల్‌కుమార్.. వీరిలో ఎవరికో ఒకరికి మంత్రి వర్గంలో స్థానం దక్కవచ్చు.

కేంద్ర మంత్రి పదవిపైనా కన్ను!

చిత్తూరు ఎంపీగా గెలుపొందిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావు కేంద్ర మంత్రి పదవిపై కన్నేసినట్లు విశ్వసనీయ సమాచారం. కేంద్రంలో టీడీపీ భాగస్వామ్యం కావడంతో ఆయన మంత్రి పదవి ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన ఇప్పటికే చంద్రబాబు ముందు ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది.

ఐటీఐ అడ్మిషన్లకు 10 వరకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్లకు ఈనెల 10వ తేదీ వరకు అవకాశం ఉందని ఐటీఐ కళాశాలల అడ్మిషన్ల జిల్లా కన్వీనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హత, ఉన్న విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పదవ తరగతి పాస్, ఇంటర్ పాస్, ఫెయిల్ అంతకు మించి విద్యార్హతలున్న అర్హులని తెలిపారు. విద్యార్థులు తమ దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐకి అయినా వెళ్లి విద్యార్హతల సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, ఫొటో, ఫోన్ నంబర్, ఆధార్‌కార్డు, మెయిల్ ఐడీతో ఉచితంగా రిజిస్ట్రేషన్ పొందవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు.

విద్యాశాఖ డీడీగా విజయేంద్రరావు



చిత్తూరు కలెక్టరేట్ : విద్యాశాఖ ఏడీగా పని చేస్తున్న విజయేంద్రరావుకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు విజయవాడలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ) విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా, అడిషనల్ డైరెక్టర్‌గా, చిత్తూరు, తిరుపతి, పుత్తూరు, మదనపల్లె డీవైఈఓగా, జిల్లా విద్యాశాఖాధికారిగా సుదీర్ఘకాలం విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతి పొంది రాష్ట్ర అధికారిగా నియమితులయ్యారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

జయ జనార్దనా కృష్ణా..

- నేత్రపర్వం ..
- వేణుగోపాలుని పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

కార్వేటినగరం: చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు తదితర సంప్రదాయ పుష్పాలు, తులసి, మరువం వంటి ఆరు రకాల పత్రాలు కలిపి టన్ను పుష్పాలతో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారికి శుక్రవారం పుష్పయాగం అంగరంగ వైభవంగా జరిగింది. అశేష భక్తులు వీక్షించి తన్మయత్వం చెందారు. కర్ణాటక, తమిళనాడుకు చెందిన భక్తులు, పలువురు స్థానికులు పుష్పాలను విరాళంగా సమర్పించారు. గత నెల 29 నుంచి ఈనెల ఆరవ తేదీ వరకు శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సమయంలో అర్చకులు, పరిచారకులు, అధికారులు, అనధికారులు, భక్తుల కారణంగా జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల మధ్య రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరి నీళ్లతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 3.30 వరకు వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కంకణభట్టు నారాయణ దాశరథి ఆధ్వర్యంలో పుష్పయాగం నిర్వహించారు. తదుపరి సాయంత్రం 4.45 నుంచి 7 గంటల వరకు స్వామివారు తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, వేదపండితులు దాశరథి, గోపాలచారి పాల్గొన్నారు.



తిరుచ్చిపై స్వామివారి విహారం

సాగుకు సన్నద్ధం

వరుణుడు కరుణించాడు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో వర్షాలు ముందస్తుగా కురుస్తున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పొలాలను సిద్ధం చేస్తున్నారు. తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఈఏడు పంటల సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- నైరుతి రాకతో సాగుకు అనుకూల వాతావరణం
- జిల్లాలో ఇప్పటికే 38వేల క్వింటాళ్ల విత్తనాల పంపిణీ
- ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులు
- సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం



పలమనేరు మండలం కరిడిమొడుగు వద్ద దుక్కి దున్నుతున్న రైతు

సాక్షి, చిత్తూరు: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మే నెలలోనే వర్షాలు ప్రారంభమయ్యాయి. మే నెలలో 61.7 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, దాదాపుగా నమోదైంది. దీనివల్ల సాగునేల చల్లబడింది. ఈ ఏడాది కూడా నైరుతి రుతు పవనాలు అనుకున్న సమయం కంటే ముందుగానే ప్రవేశించాయి. ఫలితంగా వర్షాలు ఆరంభమయ్యాయి. సాధారణంగా జూన్‌లో నెలలో 80.8 మిల్లీమీటర్లు వర్షం కురవాల్సి ఉంది. తొలివారానికే ముందే 75.4 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ఆవర్తన ప్రభావం జిల్లాపై ఉంది. దీనివల్ల వర్షాలు మరింతగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. దీనివల్ల చెరువులు నిండి, భూగర్భ జలాలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో రైతాంగం సాగుపై మరింత దృష్టిసారించింది.

పొలాలు సిద్ధం

ఖరీఫ్ సీజన్ కోసం ఇప్పటికే 38,655 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనాలు అందుకున్న రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలోనే వర్షాలు సంవృద్ధిగా కురుస్తుండడంతో సాగుకు అనుకూలంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

81.169 హెక్టార్లలో సాగు

ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 81.169 హెక్టార్లు. అందులో అత్యధికంగా వేరుశనగ పంట 55,661 హెక్టార్లు సాగులోకి రానుంది. మిగిలిన విస్తీర్ణంలో చెరకు, వరి, చిరుధాన్యాలు, కాయగూరలు సాగులోకి రానున్నాయి. ముందస్తు వర్షాల కారణంగా సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా.

సాగుకు సహకారం



ఖరీఫ్‌లో పంటల సాగుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందించింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏ చిన్న సమస్య తలెత్తినా సిబ్బంది వెంటనే రైతులకు అవసరమైన సూచనలు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. ముందుగానే వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. రాయితీ ద్వారా మిశ్రమ పంటల సాగుకు కూడా ప్రోత్సహిస్తున్నారు. –రామకృష్ణారెడ్డి, గుర్రంవారికండ్రిగ, వెదురుకుప్పం మండలం

వర్షంతో ప్రాణం వచ్చింది



ఇప్పటికే ఐదు ఎకరాల్లో వరి, రెండు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. ఇటీవల ఎండ తీవ్రతకు పంట చాలా వరకు దెబ్బతినింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో పంటలకు ప్రాణం వచ్చినట్లు అయ్యింది. పచ్చదనం పెరిగింది.

– పాండియన్, కాళికాపురం

అన్ని పంటలకు అనుకూలం



ఈ ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనలేసేందుకు అదును బాగుంది. ముందుగానే విత్తన కాయలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈనెల మొదట్లోనే విత్తనాలేసుకుంటే పంట దిగుబడి బాగుంటుంది. వరినార్లు పోసుకునేందుకు, కూరగాయల సాగుకు కూడా వాతావరణం అనుకూలంగా ఉంది.

– వెంకటరెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

సాగుకు అనుకూల పరిస్థితులు



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉంది. 38వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశాం. సాగుకు రైతులు సన్నద్ధంగా ఉన్నారు. సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. – మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

హాస్టళ్లలో వంద శాతం ప్రవేశాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలను పెంచాలని ఆ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది కంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 100 శాతం విద్యార్థుల ప్రవేశాలు జరిగేలా వార్డెన్లు క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా విద్యార్థుల పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న విద్యార్థులకు సమాచారం ఇచ్చి హాస్టళ్లలో చేర్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని హాస్టళ్లను పరిశుభ్రంగా సిద్ధం చేయాలని వార్డెన్‌లకు ఆదేశాలు జారీ చేసినట్టు డీడీ రాజ్యలక్ష్మి తెలిపారు.

అధినేతను కలిసిన వెంకటేగౌడ


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వెంకటేగౌడ

పలమనేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఆపద్ధర్మ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, భవిష్యత్తు కార్యాచరణ, నియోజకవర్గ పరిస్థితులపై ఆయనతో చర్చించినట్టు వెంకటేగౌడ తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

పూతలపట్టు: గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనార్ మధుబాల అన్నారు. గ్రంథాలయాల్లో వేసివి శిక్షణ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలకు వెళ్లి పఠనా సామర్థ్యం పెంచుకునేలా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని సూచించారు. ఇంగ్లిష్ గ్రామర్, పద్యాలు, కథలు, డ్రాయిగ్, హ్యాండ్‌బాల్, సంగీతం, నాట్యం వంటి వివిధ రకాలైన శిక్షణలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వేసవి శిబిరాలు దోహదపడుతాయని తెలిపారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లడం దినచర్యగా మార్చుకుని, దినపత్రికలు, విజ్ఞాన పత్రికలు చదవాలని తెలిపారు. శిక్షణ శిబిరాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు మధుబాల బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి రవీంద్రబాబును అభినందించారు.

మశకం..ప్రాణాంతకం

మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణాల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటోంది. ఇది మురుగుమయమై దోమలకు ఆవాసంగా మారుతోంది. కలుషిత నీరు, పారిశుద్ధ్య లోపం, దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్ ప్రబలే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త
- ముంచుకొస్తున్న వర్షాలు
- విజృంభిస్తున్న దోమలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


కాణిపాకం: పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాణిపాకం: జిల్లాలో వాతావరణ పరిస్థితులు మారిన నేపథ్యంలో వ్యాధులు పొంచి ఉన్నాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని లేదంటే దోమకాటుతో విష జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యాధికారులు సూచిస్తున్నారు. అనాఫిలిస్ అనే దోమ కాటు వల్ల మలేరియా జ్వరం వ్యాపిస్తుంది. నిల్వ ఉన్న నీటితో పాటు తాగునీటిలో కూడా ఈ దోమ వృద్ధి చెందుతుంది. ఈ దోమ వల్ల వచ్చిన జ్వరం 10 నుంచి 14 రోజుల పాటు ఉండి వాంతులు కూడా అవుతుంటాయి. ముందు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరవు.

డెంగీ లక్షణాలు..

సాధారణంగా ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమ గుడ్లు పెడుతుంది. ఈ వ్యాధి సోకితే 15 రోజుల పాటు జ్వరం ఉంటుంది. తలనొప్పి, నొసటిపై, కంటి నొప్పితో రోగి చాలా బాధపడుతాడు. కడుపు నొప్పి కూడా వస్తూ ఉంటుంది.

చికున్ గున్యా

ఈడిస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చ లుంటాయి. ఈ వ్యాధి బారిన పడిన రోగికి 10 నుంచి 14 రోజుల పాటు తీవ్ర నొప్పులతో కూడిన జ్వరం ఉంటుంది. జ్వరం తగ్గినా మరో 10 రోజుల పాటు తీవ్రంగా ఒళ్లు నొప్పులు ఉంటాయి.

మెదడువాపు వ్యాధి

మెదడువాపు వ్యాధి ప్రాణంతకమైంది. క్యూలెక్స్ దోమ వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువ రోజుల పాటు మురుగునీటి నిల్వల్లో పెరు గుతుంది. 14 రోజుల పాటు తీవ్రమైన జ్వరంతో బాధపడుతుంటారు. ఈ జ్వరం తీవ్ర మైతే బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సాధారణంగా ఈ జ్వరం రెండు నుంచి 14 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది.

దోమల నియంత్రణ ఇలా

- మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి
- మురుగు కాలువల్లో నీరు సక్రమంగా పారేలా చేయాలి
- పరిసరాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు తొలగించుకోవాలి
- ఇళ్ల మధ్య గోతుల్లో మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలి
- నీటి నిల్వల్లో దోమల నియంత్రణ మందు వేయాలి
- దోమ తెరలు, ఇతరత్రా విధానాలు అవలంభించాలి

రక్షణ పొందాలి



ఇటీవల కాలంలో అక్కడక్కడ వైరల్ ఫీవర్లు నమోదవుతున్నాయి. దోమల కాటు నుంచి రక్షణ పొందాలి. వైరల్ ఫీవర్ వస్తే మందులు వాడితే తగ్గుతుంది. అలా కాకుండా జలుబు, తలనొప్పి, వాంతులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించి అవసర మైన వైద్యం పొందాలి. అజాగ్రత్తగా ఉంటే వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగ కారకాలను అధిగమిం చవచ్చని గుర్తించాలి.

-ప్రవీణ, పీహెచ్‌సీ వైద్యాధికారి, పూతలపట్టు

నామినేటెడ్ పోస్టుకు రాజీనామా


రాజీనామా పత్రాన్ని సమర్పిస్తున్న రవీంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ పదవికి దేశిరెడ్డి రవీంద్రనాథరెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మెడికల్ ఆఫీసర్ షమామా రెహమాన్‌కు అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 27 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,161 మంది స్వామివారిని దర్శించుకోగా 28,923 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ

తిరుపతి లీగల్ : రాయలసీమ జిల్లాల్లోని 30 మంది న్యాయమూర్తులకు నాలుగు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు తిరుపతి మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయమూర్తులకు శిక్షణ ఇచ్చిన ఢిల్లీ జిల్లా జడ్జి నిరజా భాటియా, కర్ణాటకకు చెందిన సీనియర్ ట్రైనర్ సుశీలను జిల్లా జడ్జి సన్మానించారు. అనంతరం జిల్లా జడ్జి భీమారావును తిరుపతి అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, జిల్లా న్యాయ సేవా సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి రవి సత్కరించారు.

పాల వెల్లువ కేంద్రంలో చోరీ


పగులగొట్టిన తాళం

సదుం: మండలంలోని పాల వెల్లువ కేంద్రంలో చోరీ జరిగినట్టు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. ఫిర్యాదు దారుడు నారాయణ రెడ్డి కథనం మేరకు..బత్తలవారిపల్లె సమీపంలో ప్రభుత్వ పాల వెల్లువ కేంద్రం ఉంది. ఇంకా కార్యకలాపాలు ప్రారంభం కాలేదు. కేంద్రంలో పంచాయతీకి సంబంధించిన వస్తువులు ఉంచి తాళం వేశారు. గురువారం రాత్రి షట్టర్, కేంద్రంలోని తలుపులకు ఉన్న తాళాలను పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బోరు స్టార్టర్, పైపులు, కేబుల్ చోరీకి గురైనట్టు గుర్తించామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 20 మందికి రూ.10వేల చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనం నడిపిన 20 మందిని గుర్తించామన్నారు. వీరికి రూ.10 వేల చొప్పున జరిమాన విధించామని, రోడ్డు భద్రత నియమాలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సేంద్రియం.. లాభాల సేద్యం


కాకవేడులో సేంద్రియ పద్ధతిలో బేనీసా మామిడి సాగు

ప్రపంచీకరణ నేపథ్యంలో సేంద్రియ సాగు(ఆర్గానిక్) పంటల దిగుబడులకు ఎగుమతి అవకాశాలతో పాటు అధిక డిమాండ్ ఉంటోంది. రసాయనాలకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా నేలతల్లి ఆయుష్షును పెంచడంతో పాటు ఆరోగ్యకర పంట దిగుబడులకు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని రైతులు గుర్తించారు. ప్రకృతిలో దొరికే ఆకుల కషాయాలను వాడుతూ పండించే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తోంది. దీంతో రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించారు. నగరి నియోజకవర్గంలో 50 ఎకరాల్లో మామిడి, కూరగాయల పంటలు సేంద్రియ పద్ధతిలో సాగవుతున్నాయి.

- ఆరోగ్యకర పంటల దిగుబడులు
- మార్కెట్‌లో మంచి ధరలు
- మామిడి, కూరగాయల పంటల సాగు

నగరి : నియోజకవర్గంలో రైతులు రసాయనిక సాగు హానికరమని గుర్తించారు. సేంద్రియ సాగుపై దృష్టి సారించారు. మామిడి, కూరగాయల పంటలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. మార్కెట్‌లో రసాయనాలు వాడి పండించిన మామిడి నిగనిగలాడుతూ కనిపిస్తున్నా అవి కాల్షియం కార్బైడ్‌తో మాగపెట్టిన పండ్లు కావడంతో కొనుగోలు చేసుకోవడానికి జనం సంశయిస్తున్నారు. పక్వానికి రాని మామిడి పండ్లు, గాలికి రాలిన మామిడి పండ్లను సైతం రసాయనాల ద్వారా మాగనిచ్చి మార్కెట్‌లో చౌకగా అమ్మకాలకు ఉంచుతున్నారు. ఇవి పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి రుచి పుల్లగా ఉంటుంది. ముక్కు దగ్గరగా ఉంచుకున్నప్పుడు మాత్రమే పండు వాసన వస్తుంది. పండు త్వరగా చెడిపోతుంది. వీటిని తింటే ఆరోగ్యానికి హానికరమంటూ వ్యవసాయ అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో పలువురు రసాయనాలు వాడక సేంద్రియ పద్ధతిలో సాగు చేయడంతో పాటు వాటిని ఎలాంటి రసాయనాలు లేకుండా కసువు వేసి మాగనిచ్చే మామిడి పండ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. కాస్త ధర ఎక్కువైనా ఆరోగ్యం ప్రధాన మంటూ ఆర్గానిక్ మామిడి పండ్లు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. తినే సమయాల్లో ఈ పండ్లు ఇచ్చే రుచి ఆర్గానిక్ పండ్లు అంటే ఇవిరా... అన్నట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

నగరి నియోజకవర్గంలో 50 ఎకరాల్లో మామిడి, కూరగాయల పంటలు సేంద్రియ పద్ధతిలో సాగవుతున్నాయి. నగరి మండలంలోని కాకవేడు, ముడిపల్లె ప్రాంతాల్లో 10 ఎకరాల్లో, విజయపురం మండలం కోసలనగరంలో పది ఎకరాల్లో మామిడి ఈ పద్ధతిలో సాగవుతోంది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తుండడం, స్థానికంగానే ఉన్న రైతు భరోసా కేంద్రాలు సలహాలు అందిస్తూ ప్రోత్సహిస్తుండడం రైతుకు ధైర్యాన్ని ఇస్తోంది. వేలల్లో ఖర్చయ్యే ఎరువులకు, పురుగుల మందులకు స్వస్తిపలికి సొంతంగా తయారు కషాయాలను తయారుచేసుకుంటున్నారు. పంచకావ్య, బ్రహ్మాస్త్రం, ఆగ్నాస్త్రం, నీమాస్త్రం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, కంపోస్టు, వేపపిండి, జనుము లాంటివి ఎరువుగా వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతోంది.

భూసారానికి రక్ష

సేంద్రియ సాగు ద్వారా భూమి సారం కోల్పోదని, ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని వస్తుందని రైతులు చెబుతున్నారు. వీటి వాడకం వల్ల భూసారం పెంచే వానపాములు తయారవుతాయని అంటున్నారు. ఈ పద్ధతిలో పండించిన పంటల్లోను వ్యత్యాసం ఉంటోందన్నారు. పంటల కొనుగోళ్లకు కూడా మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటోందని చెబుతున్నారు. రసాయనాలు వాడే పంటకన్నా ఈ పద్ధతిలో పండించే పంట దిగుబడులు ఆరోగ్యకరంగా ఉండడంతో మంచి డిమాండ్ ఉంటోందని రైతులు పేర్కొంటున్నారు.


సేంద్రియ పద్ధతిలో బెంగుళూరా మామిడి సాగు


కసువు, పేపర్ ముక్కలతో మాగబెట్టిన మామిడి కాయలు

17 నుంచి అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలు

పుత్తూరు: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు టీటీడీ ప్రకటన విడుదల చేసింది. 11న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరగనున్నాయి. 20వ తేదీ సాయంత్రం 4-30 నుంచి 6-30 వరకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. రూ.500 చెల్లించి గృహస్తులు ఇద్దరు పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, రవిక, లడ్డూ, ఒక అప్పం అందజేస్తారు.

వాహన సేవలు ఇలా:

17వ తేదీ ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేష వాహనం, 18న ఉదయం చిన్నశేష వాహనం, సాయంత్రం హంస వాహనం, 19 ఉదయం సింహ వాహనం, సాయంత్రం ముత్యపు పందిరి వాహనం, 20 ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం కల్యాణోత్సం, రాత్రి సర్వభూపాల వాహనం, 21 ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడ వాహనం, 22న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజ వాహనం, 23న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 24 ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 25 ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఈ మేరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణ పూజలు చేస్తున్న పండితులు


చంద్రప్రభ వాహనంలో ఊరేగుతున్న దేవదేవేరులు

- శాస్త్రోక్తంగా ధ్వజారోహణం
- చంద్రప్రభ వాహనంపై విహరించిన దేవదేవేరులు

యాదమరి (బంగారుపాళెం): మండల కేంద్రంలోని త్రివేణి సంఘమంలో వెలసిన ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చక వేదపండితులు శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. అంతకముందు వేకువజామున మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణ, అర్చన నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ధ్వజస్తంభం వద్ద కొలువు తీర్చి పూజలు చేశారు. భట్టాచార్యులు పవనకుమార్ స్వామి, వరదరాజ ఆచార్యులు, శ్యామసుందర ఆచార్యులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి 12 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆగమశాస్త్ర ప్రకారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి భక్తులు హాజరై కర్పూర నీరాజనాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం బలిపీఠం, ఉత్సవ మూర్తులను పుర వీధులలో ఊరేగించారు. భక్తులు స్వామివారికి నారికేళాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

చంద్రప్రభ వాహనంపై దేవదేవేరుల విహారం

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో దేవదేవేరులు శుక్రవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు వాహన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవమూర్తులను చంద్రప్రభ వాహనంలో కొలువు తీర్చి సుగంధ పుష్పాలతో అలంకరించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చక వేదపండితులు మురళీ, హేమంత్ ఆచార్యులు, కృష్ణాచార్యులు

నేడు హంస వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించనున్నారు. రాత్రి హంస వాహనంపై ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.